# మొలకల పున్నమి

-వేంపల్లి గంగాధర్

సినుకులు కురుస్తాండాయి. సగం దావలో వుండాను. మిట్టమధ్యాహ్నామప్పుడు ఈ సినుకులేందో... యాడన్నా రొంచేపు నిలబడదామని సుట్టూ జూస్తి. రాళ్ళ గుట్ట తప్ప యింకేం కనపడలేదు. అట్నే బిరబిర ఎక్కితి. గుట్టపైనుండి కిందకు చూస్తిని. పసుపు పొడి ఎదజల్లినట్టుంది నేలపైకి. గుత్తులు గుత్తులుగా విరగబూసిండాయి సెండుమల్లెపూలు పసుపచ్చగా. నేలంతా పూలగంపతిన్నా కనపడతాంది. సెండుమల్లెపూల మీద సినుకులు కురస్తాంటే పల్లె పాటలన్నీ జలజల రాలిపడతా వుండాయి. మిట్టమీద నుండి కొట్టుకొస్తాండే ఈదురుగాలికి సెండుమల్లెలు ఈల పాట పాడతాండయి. రేకులు రాలిన పూలు వానలో చిన్న పడవల తిన్నా కదిలిపోతాండాయి దాగదాల వంకలోకి. ఈసారి పూలకాపు ఇరగ కాసింది. సినుకులు రొంత తగ్గినాయి. దిగుతా దూరంగా జూస్తి.

ఔ ... వస్తాంది... ఆయమ్మి.. శ్యామల!

పూసినకాడికి కోసిన సెండుమల్లె పూల గంప నెత్తికెత్తుకొని గట్టు దావెంబడి నడిసొస్తాండే ఆయమ్మి అందం దిక్కే సూడాలనిపిస్తాంది. అయినా మా నాయనకు తెలీకుండానే ఏంధైనా సెయ్యాల... తెలిస్తే యింగేముంది... యిల్లు యిడిపించకుండా ఊరికుంటాడా... ఏంది?

మొన్న ఆ సింతమాన్ల బాయికాడికి ఆయమ్మిని పిల్సుకరమ్మని పీరమ్మవ్వకు చెప్పంపితే 'నేనట్టాటిదాన్ని కానని' చెప్పమనిందంట. యింగ సేసేదేందుంది? అయినా నా కుర్రతనం ఎట్టా నిద్రపోతాది? ఆయమ్మిని ఆదుకునేదాకా దాని అందమే గుర్తొచ్చి సంపుతాంటే...

వొలిపిరి కొడతాంటే సినుకులోపక్క... వొళ్లంతా పూల గుత్తుతిన్నా సేసుకొని గిరేసుకొచ్చే ఆయమ్మి తడిసిన సొగసు సెండ్ల వయ్యారం ఇంగోపక్క. రవ్వంతసేపు ఊపిరాడలేదు. ఆయమ్మి వెనకాల వస్తాండే కూలికొచ్చిన



ఆడోళ్ళు లేకుంటే దాని పని జెప్పిందు. దానెక్క తప్పించుకొంది. నన్ను సూసి సూడనట్టు సూస్తా పాయె ఆయమ్మి. నేనేమో ఆయమ్మి ఎల్లబారిపో యిన దిక్కుకే చూస్తాంటి.

సన్నగా సినుకులు పడతానే వుండాయి. నేనూ ఇంటిదారి పడితి.

* * *

రాతిరి పండుకున్నానే గానీ నిద్రపట్టలేదు. ఆయమ్మి ఆలోచనల్లో వుండగానే సాంబశివుడు వచ్చి పక్కనే కూర్చున్నాడు. ఆమాటా, ఈమాటా మాట్లాడుకున్నాక సిన్నగా గుడిసెల కాడ వుండే శ్యామల యిషయం తీసుకొచ్చిపెడితి. సాంబుడు పడిపడి నవ్వే.

'నవ్వాకు... ఎందన్నా వుంటే సెప్పిపారేయ్... నువ్వు ఆమంతన నవ్వితే నే ఏమనుకోవాలా...' అంటి రోంత ముఖం మాడ్చుకొని. సాంబుడు నా మాటల్ని పట్టించుకోకుండా నవ్వుతూనే వుండాడు.

సాంబశివుడు మా సొంత మనిషి. నాకంటే రెండు మూడేళ్ళు పెద్దోడే. అయినా ఇద్దరం కులా సాలు పడతానే వుంటాం. నా సిన్నప్పుడెప్పుడో లక్కిరెడ్డిపల్లె జాతరకు మా నాయనోళ్ళు పోయిన ప్పుడు ఆడుండే గంగమ్మ గుడికాడి సత్రం కాడ 'సాంబుడు' కనపడి ''దిక్కులేరయ్యా.. నేనూ మీ ఎద్దల బండి ఎనకాలే వస్తాన''ని వెంటబడితే తీసు కొచ్చి పెంచినారు. ఆ పనీ ఈ పనీ చేయిస్తా సాకి నారు. మనిషి మంచోడు. శానా మెతక. మా ఊర్లో నాకిష్టమైన మనిషి కూడా. పొలంకాడ్నే వుండి కాపుకాస్తాడు. పైరుకు నీళ్ళు పెడతాడు. పని పట్టు కుంటే సేసేదాకా యిడిసిపెట్టడు. అందరూ 'తిక్క సాంబుడు' అంటారు. అయినా దేన్నీ పట్టించు కోడు. సాంబుడి కత సాంబుడిది. తన పనేందో.. పాటేందో... అంతే!

వాడు నవ్వుతానే వుండాడు.

నాకు మళ్ళీ మండింది.

'ఛూ... నీయవ్వ నువ్వు ఆపు...!' గదురుకుంటి.

'సాల్లే.. పాపోడా... నీ యవ్వారం నాకు తెల్దా... ఆయమ్మి సంగతి అంటాండవ్వంటే ఆ తిరకాసు నాకు తెల్దా...' కళ్ళు ఎగరేస్తా అన్నాడు సాంబుడు.

'ఔ... వుంది నాకూ ఆయమ్మికి మధ్యన జంజా టం' అంటి వెటకారంగా.

'జంజాటకాల కాడికి పోయిందంటే కత శానానే వుండాలే.. బాగానే సరిజేసినట్టుండావ్.. పాపో డా...!' అన్నాడు బీడీ ముట్టించుకుంటా.

'సరిజేసేకాడికి పోలేదుగానీ... నువ్వు జెప్పి చూసి సరిజేసిపెట్టు' అడిగితి సాంబుడు ఏం జెబు తాడోనని తత్తరకొద్ది.

'సామీ... ఏదో కల్లంకాడ, పొలంకాడ పని సేసు కొనేటోడ్ని. నన్నెందుకు ఇరికిస్తావు... లంపలాట లోకి. నీకోదండం...' భుజంపైనుండే తుండుగుడ్డ విదిలించుకొని అన్నుంచి లేచిపొయినాడు సాంబుడు.

నాకైతే ఆయమ్మి చింతే పట్టుకొంది.

ఆయమ్మికి ఎట్టుందోగానీ...!

* * *

తెల్లారింది.

ఏదో పాట వినబడతాంది.

''కొలని దోపరికి గొబ్బిళ్ళో
యదుకుల సామికి గొబ్బిళ్ళో
కొండ గొడుగుగా ఆవులగాచిన
కొండొక శిశువుకు గొబ్బిళ్ళో...

ఆ గొంతు కూడా యాడ్నో బాగా విన్నట్లే వుంది. మిద్దెపైనుంచి కిటికీ దిక్కు వచ్చి తొంగి కిందకి చూస్తి. గొబ్బిళ్ళు తడతాండరు. గొబ్బిళ్ళంటే చిన్నప్పటినుంచి నాకు సంబరం.

ఆవుపేడ తీసుకొచ్చి బొమ్మ తిన్నజేసి గురి గింజలు కళ్ళ తిన్న పెట్టి గన్నేరుపూలు జల్లి పసుపు, కుంకాలతో పూజలు జేసి పల్లెంలో పెట్టుకొని ఇల్లిల్లు తిరిగే ఆడపిల్లకాయల ఎంబిడి చిన్నతనంలో తిరిగేటోన్ని. మాయమ్మ తిట్టిపో సేది.

'నువ్వేమయినా... ఆడపిల్లవా' అని సుట్టుపక్క లోళ్ళు గేలి చేస్తాండ్రి. ఇట్టా ఆలోచనల్లోనుండగానే ఇంగో గొంతు అందుకుంది గొబ్బిపాట...

''పాప నిధుల శిశుపాలుని తిట్టిన
కోపకానికిని గొబ్బిళ్ళో
యేపున గంసుని యిడగుల బెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్ళో...''

ఔను... ఆ గొంతు... ఆయమ్మిదే... ఆడ గొబ్బి సూట్టు కారం జేసి తప్పట్లు తట్టే ఆడపిల్లోళ్ళలో ఆయమ్మి కూడక వుంది.

దబదబ కిందకి దిగాలనే వుంది.

ఆయమ్మి సంగతి సూడాలనే వుంది. అయినా అది కుదరని పని.

మా నాయన ఆడనే సూస్తాండడు.

మాయమ్మ సేరుతో నూకలు తెచ్చి వాళ్ళు తెచ్చుకున్న జోలేలో పోసింది. గంపెడు సెండు మల్లెపూలు తెప్పిచ్చినాడు మా నాయన. ఆడపిల్లో ళ్లందరూ తలా ఇన్ని ఎదురుకొని కొప్పుల్లో పెట్టుకొ నిరి.

ఆయమ్మి సిగలోకి జేరిన సెండుమల్లి సూర్యుణ్ణి కోసుకొచ్చి కురుల్లో కూర్చుకున్నట్లుంది.

ఆయమ్మి సొగసుకు సెండుమల్లె వెలుగు సక్కగా కుదిరింది.

అట్నే చూస్తుండిపోతి.

ఇంతలో మా సాంబుడు గూడా వాళ్ళలో జేరి గొబ్బిళ్ళు తట్టడం మొదలుపెట్టినాడు. ఈ తిక్కలో డొకడు అనుకుంటి.


సాంబుడు పాటెత్తుకున్నాడు...

'గోపికల రాజుకు గొబ్బిళ్ళో
గోపబాలునికి గొబ్బిళ్ళో
రాసలీలలు నేర్పిన రమణి రాధకు గొబ్బిళ్ళో
మురళి గాన మోహితుడికి గొబ్బిళ్ళో'

నాకు నవ్వు ఆగలేదు... సాంబుడి పాటకు. ఆడ పిల్లోళ్ళు గూడా కలిసి అడుగేస్తాండరు. మా నాయన నాలుగు రూకలు తీసి నవ్వుకుంటా సాంబుడి సేతిలో పెట్టినాడు.

* * *

సందెకాడ సిన్నగా సత్రంకాన్నుంచి ఎల్లబారి అట్నే దిగదాలకు కంపసెట్లను దాటుకుంటూ కాలి బాటగుండా దారిబడితి గుడిసెల కాడికి. రెప్పొ ద్దున కూలి పనులకు రమ్మని చెప్పివద్దామని... నేను అనుకున్న పని అనుకున్నట్లయితే ఆ గుడిసెల కాడ్నె ఆ పక్కనుండే ఆ యమ్మిని కూడా ఒక గిల్లుగి ల్లుకొని రావాలనే వుంది.



పీరమ్మవ్వకోసం కట్లపొడి కట్టించుకుంటి. ఆయవ్వకు అదంటే ఎంతిష్టమో. ఎప్పుడూ ఆకు, వక్క, కట్లపొడి నోట్లో పోసుకొని ఆ మంతన నములుత్తానే వుంటాది. ఆయవ్వను ఎట్లైనా ఆయమ్మి కాడికి మాట్లాడిరమ్మని పంపితే ... ఆయమ్మి ఒప్పుకుంటాదో.. లేదో... మళ్ళీ నా చింత నాది. నేను కొట్టాల కాడికి అడుగుపెడితినో లేదో ఆడుండే కుక్కలు 'భౌ'మని లగుసుకున్నాయి. నాకైతే దిక్కు తెల్యా. ఉరికితే... వెంటపడతాండయి. యింగెం జేసేది....

అడ్డం సందులోకి దూరి తడికెలకు ఆ పక్కకి దూకి నీళ్ళ తొట్టిలోకి పడితి. తడికెలకు దూరంగా కుక్కలు మొరుగుతానే వుండె. రొంతలేసి జూస్తి. ఎదురుగా ఆయమ్మి. ఆయమ్మే శ్యామల. తొట్లో పడిన నన్నుజూస పగలబడి నవ్వుతాంది.

'ఛా' పడిపడి ఈయమ్మి కళ్లల్లో పడితి.

'గబ్బు కుక్కలు... ఛా' తిట్టుకుంటాండ.

'నిదానంగా లెయ్ సామీ...' లేపడానికి వచ్చింది ఆయమ్మి. నేనే రోసంగా ఇదిలించుకొని పైకి లేస్తి.

యింగ ఆడికే పీరమ్మవ్వ కూడా వచ్చింది.

'ఏం సామీ... సెప్పి అంపితే మేమే వచ్చేటోళ్ళం కదా' అనింది.

'సూసి పోదామని వస్తిలెవ్వా ఈ గబ్బుకుక్కలు ఎంటపడినాయి గానీ' – అంటి చేతిలోని కట్లపొడి ఆయవ్వకిస్తూ.

'బంగారమట్ట కట్లపొడంతా తడిసిపాయె కదా సామీ... ఎండబెట్టికొని వేసుకుంటాలే' అని తీసుకుంది.

ఆయమ్మితిక్కే కన్నార్పకుండా చూస్తి.

ఆయమ్మి తలొంచుకుని గుడిసెలోకి పొయింది.

మళ్ళీ రొంతసేపుకు బయటకొచ్చి గంగమ్మ గుడికాడ దీపారాధనకని పోయింది. నేను చూస్తానే వుండా ఆయమ్మి వాలకం.

'దీపారాధన ఏమిటికవ్వా?' అడిగితి అవ్వను.

'గంగమ్మ తల్లికి సామీ... ఆడ్నె గురువులయ్య వుంటాడు. కోలన్న కట్టెలాట, చెక్కభజన, కులుక భజన ఆటలన్నీ నేర్పిస్తాడు. రేయికి అందరం ఆడికే పోతాం. కొట్టాల్లోని చిన్నాపెద్దా అందరూ ఆడికే వస్తారు. శానా బాగుంటాది' సెప్పింది అవ్వ.

మాటల మధ్యలో నా సూపు గుడిసెలో ఆ మూలకు తగిలించిన తప్పెట పలక మీద పడింది.

'అవ్వా.. దాన్ని ఎవరు వాంచుతారు?' అడిగితి.

'నాకొడుకు.. కొండయ్యగాడు వాంచుతాడు సామి...' మురిసిపోతూ సెప్పింది.

తప్పెట పలక శబ్దమంటే నాకిష్టం. జాతరకాడ నేనెప్పుడూ వుండేది ఆడ్నె. గడ్డి మోపుకు అగ్నిపెట్టి ఆ సెగకు పలక తిప్పి భుజానికి ఏసుకొని రెండు పుల్లలతో కొడితే అది పలికే శబ్దంకు చిందులేసేటోళ్ళు.. తిరుణాలకే ముచ్చటగుంటాది. నరాల్లోని నెత్తురంతా తప్పెట శబ్దానికి జెగ్జినక తొక్కుతాది.

అవ్వతో మాట్లాడతాండంగానే గంగమ్మ గుడికాడ సందడి మొదలైంది. ఆయమ్మి గొంతు వినపడతాంది.

'మొక్కులు మొక్కుంటాం గంగమ్మ తల్లీ
ఎండి ముక్కెర సేసిత్తాం గంగమ్మ తల్లీ
ఎండి కోరలు సేసిత్తాం గంగమ్మ తల్లీ
సల్లంగ మముజూడు గంగమ్మ తల్లీ...'

యింగ నేనొచ్చి పని కాని పనన్ని అర్థమయ్యింది. నేను అక్కడ్నుంచి బయలుదేరాను అప్పకొడుకు కొండయ్యను తోడుబెట్టుకొని. దూరంగా దారెంబడి గుడికాడి ఆయమ్మి పాట వినపడుతూనే వుంది.

'మళ్ళీ తప్పించుకుంది... దీనెక్క' అనుకుంటి.

* * *

ఇంటికొచ్చి పండుకున్యానే గానీ ఆయమ్మే గుర్తుకొస్తాంది. కాదు... అనుకొని మనశ్శాంతికోసం సాంబుడి కాడికి పోతి.

'ఏం... సామీ యింత రేత్తిరప్పుడు వస్తివి' అంటూనే అరుగుమీద లేచి కూర్చుండ్య.

'ఇంటికాడ నిద్ర రాకుంటే వస్తిగానీ... ఆ నవ్వు మాటో, యాదో ఒకటి కతనో చెప్పు' అంటి అరుగు మీద పడుకుంటూ.

నిద్ర రాకుంటే సాంబుడి దగ్గరికెళ్ళి యాదోఒకటి చెప్పించుకుంటూ నిద్రపోవడం నాకు అలవాటే.

**తప్పెట పలక శబ్దమంటే నాకిష్టం. జాతరకాడ నేనెప్పుడూ వుండేది ఆడ్నె. గడ్డి మోపుకు అగ్నిపెట్టి ఆ సెగకు పలక తిప్పి భుజానికి ఏసుకొని రెండు పుల్లలతో కొడితే అది పలికే శబ్దంకు చిందులేసేటోళ్ళు.. తిరుణాలకే ముచ్చటగుంటాది. నరాల్లోని నెత్తురంతా తప్పెట శబ్దానికి జెగ్జినక తొక్కుతాది.**

సాంబుడు కత సెప్పడం మొదలుపెట్టాడు.

అనగనగా ఒక రేనాటి రాజ్యం. ఆ రాజ్యం రాజుకో సమస్య వచ్చిపడె. ఊర్లో యాపసెట్టు, రావిసెట్టు కలిసి పెనవేసుకొని అల్లుకున్న మానుకాడ నడిరాతిరప్పుడు ఏందో ఆడ దెయ్యం వచ్చి కూకొని బోరున ఏడుసుకుంటా వుంటాదని జనం వచ్చి చెప్పిరి. రాజుకు ఆశ్చర్యమేసింది. ఆ ఆడ దెయ్యం ఎవరో.. దానికొచ్చిన కష్టమేందో కనుక్కోవాలనుకున్యాడు. ఓ రేత్రినాడు ఒంటిగా గుర్రంపై కెక్కి ఆ పాడుపడ్డ గుంతబావి సెట్లకాడికి బయలుదేరాడు. సగం దూరం కాడ్నే ఏడుపు విన్పించింది రాజుకు. ఊరి జనం సెప్పేది నిజమేనని... తెల్సుకున్న సంగతి సత్యమేనని అట్నె గుర్రాన్ని ముందుకు ఉరికించాడు. సన్నగా రాజు ఒంట్లో కూడా అదురుంది. కాళ్ళు వొనుకుతాండయి. అయినా ఈ దెయ్యం సంగతి ఏందో సూడాలనే వుంది రాజుకు. గుర్రం దౌడు తీసింది. మాన్లకాడ ఆగింది. జుట్టు విరబోసుకుని ఏడుస్తున్న ఆడ దెయ్యం తలెత్తి రాజు దిక్కు జూసింది.

రాజుకు సూసే ధైర్యం యాడిది... తలొంచుకుని అడిగినాడు. ''ఆడదెయ్యమా.. ఏంది నీ సమస్య... నా రాజ్యానికి ఏంటికొస్తివి?''

ఆడదెయ్యం నోరు విప్పింది దుఃఖంతోనే...

'రాజా... తరతరాలుగా మా ఆడజాతి మగాడి సేతిలో మోసపోతాంది. అయినా మా కన్నీళ్ళు ఎవరూ తుడవడం లేదు. మా కష్టాలు తీరడం లేదు' అని బోరున మళ్ళీ దెయ్యం ఏడసడం మొదలుపెట్టింది.

దెయ్యమైనా ఆడదేకదాని.. ఆ పనికిమాలిన రాజుకు పుట్టకూడని సెడబుద్ధి పుట్టింది.

'నీ దుఖ్ఖం సూల్లెను గానీ నిన్ను నేను పెళ్ళి చేసుకుంటానని' రాజు అన్నాడు రొంత ధైర్యంతోనే.

'ఇదేమాట ఇప్పటికి కళింగరాజ్యం కాన్నుంచే రేనాటి రాజ్యం కాడికి వుండే రాజులంతా సెప్పి నాపాటికి నేను ఏడ్సుకుంటాంటే గూడా యిడిసిపెట్టకుండా పాడుబుద్ధితోనే సూస్తాండరని ఈ ఆడజన్మ దెయ్యంగా గూడా వొద్దని ఏడ్సుకుంటా...' మాయమైపోయిందట.

సాంబుడు కత ముగించి నవ్వడం మొదలెట్టినాడు. వాడి నవ్వు జూసి నాకు నవ్వొచ్చింది.

'ఈ కత నాగురించే సెప్పినావు కదూ సాంబ' అడిగితి వాడ్ని. 'గుమ్మడికాయ దొంగంటే భుజాలు జూసుకున్యాడంట అట్టుంది నువ్వడిగేది' అన్యాడు సాంబుడు. నవ్వుకుంటానే నిద్రలోకి జారిపోయాను.

* * *

ప్రొద్దున్నే నాయన పిలుస్తాండడంటే బయలుదేరితి. పెద్ద కరణం వచ్చినాడు. ఆ భూముల పట్టా కాయితాలు సూడమని జెప్పినాడు. మిద్దెమీది బీరువాలో ఎతికి తోలుసంచిలో పెట్టిన కాయితాల కట్ట తీసుకబోయి కూర్చొంటి. కౌలుకిచ్చిన భూములు, అమ్మిన భూములు, సత్రం దిగదాల వుండే బీడు భూములు అన్నింటి సంగతి మాట్లాడుకుంటా వుంటిమి.

'రాళ్ళ గుట్టకాడి సెండుమల్లె పూలతోట అమ్మమని' అడిగినాడు కరణం మాటల మధ్యలో.

'నీకు ఏతావు కావాలన్నా కొనుక్కోమని' అన్యాడు మా నాయన.

నేనేం మాట్లాడలేదు.

'ఏం పాపోడా... గమ్మున్నుండావు..' అన్యాడు కరణం.

మా నాయన నాదిక్కు జూసినాడు.

నేను తలొంచుకుంటి.

ఇంతలో పరుగుపరుగునా తోటకాడి ఓబులేసు లోపలికి వచ్చినాడు.

'ఏందిరా సంగతి అంటి' – ఆత్రంగా.

'అన్నా... తోటకాడ మన సాంబుడ్ని నల్ల నాగుపాము కాటేసింది...' సెప్పినాడు వాడు తత్తరబిత్తరగా.

'ఇప్పుడెట్టుంది' అడిగితి.

'ఇంగేముందన్నా... వాడు అడ్నే గిలగిల కొట్టుకొని తెల్లనురక గక్కుకుని సచ్చిపాయె...' అని ఏడసడం మొదలుపెట్టినాడు ఓబులేసు.

అందరం తోటకాడికి పోతిమి బిరబిర.

తోటల్లో పనిజేసే వాళ్ళందరూ వచ్చి గుమిగూడినారు. ఏందేందో మాట్లాడుకుంటాండరు. ఏడుస్తాండరు. మొత్తుకుంటాండరు.

సాంబుడు సెండుమల్లె పూలల్లోనే శవమై పడి వుండాడు. శరీరం నల్లబడింది. నోట్లోంచి నురగొచ్చి ఈగలు వాల్తాండయి.

నాకైతే ఏడుపు ఆగలేదు.

మాయమ్మ కళ్ళు తిరిగి పడిపోయింది.

జనంలోకి జూస్తి పీరమ్మవ్వ, శ్యామల, ఇంగా గుడిసెల్లోని కూలోళ్ళు అందరూ ఏడుస్తాండరు.

'అందరం ఎప్పుడో ఓసారి పోవాల్సినోళ్ళమే. రోంత ముందు, వెనుక అంతే' – వేదాంతం జెప్పినాడు కరణం.

'యింగేం జెయ్యాలో సూసి... ఆ సాంగ్యాలూ అందూ ఘనంగా జేయండి. ఈడ్నే గుంతజేసి బూడ్సండి. సమాధి కట్టండి' అని జెప్పినాడు నాయన.

పనోళ్ళు రంగంలోకి దిగిరి.

నాకైతే యాడలేని బాధగుంది.

సూల్లేకుండా వుండాను. యింగ ఆన్నుంచి వచ్చేస్తి.

* * *

రోజులు గడుస్తానే వుండాయి. సాంబుడు లేని బాధ అట్నే వుండాది. రాత్రిళ్ళు నిద్రకూడా పట్టడం లేదు. నాలో నేనే కలవరించుకుంటాండ. ఆ సెండు మల్లె పూలతోట కాడికి కూడా సరిగ్గా పోవడం లేదు. ఆడ కాపలాకుండే ఓబులేసే అంతా సూసుకుంటాండడు. కరణంకు ఆ జాగా మీద కన్నుపడింది. రోజూ ఇంటికాడికి తిరుగుతాండడని తెల్సింది.

'సరే... ఆ సెండు మల్లెతోట జాగా కరణంకు అమ్మితే నాకు అభ్యంతరం లేదని నాయనతో చెప్పమని' అమ్మకు సెప్పినాను.

అమ్మ గమ్మునుంది.

'అమ్మడం నీకిష్టం లేదామ్మ?' అని అడిగితి.

'ఆ తోటంటే నాకిష్టం నాయనా. నేను సచ్చేదాంకైనా అమ్మకుండా వుండండి... ' అని కన్నీళ్ళు పెట్టుకుంది.

మర్నాడు నేనే కరణంను కలిసి 'ఆ తోట అమ్మేది లేనేలేదని' తెగేసి సెప్పి వచ్చినాను.

మధ్యాహ్నమప్పుడు కల్లంకాడ పనికి పీరమ్మవ్వ వచ్చింది. ఈయాల మాటికి 'మొలకల పున్నమి' పండగని జెప్పింది. అరమూట బియ్యమూ, పచ్చిశనిక్కాయలు తీసుకోనిబోమని ఇస్తి. సాగం దూరంబోయి మళ్ళీ ఎనక్కి వచ్చింది. మాటికి నన్ను కూడా గుడిసెల కాడికి రమ్మని చెప్పింది.

'ఏంటికిలేవ్వా...' అని అంటి.

'అట్టంటే ఎట్టా నాయనా... పెళ్ళీడు పిల్లోడివి... మొలకల పున్నమి పండగంతా మీదే గదా. శ్యామల గూడా వుంటాది. గంగమ్మ దేవళంకాడ బాగా జరుగుతాది.... మర్సిపోకుండా రా..' అని జెప్పి ఎల్లబారిపోయింది.

'శ్యామల' అని గుర్తుజేసేసరికి మళ్ళీ ఒంట్లో నిద్రపోతాండే నరాలన్నీ ఒక్కసారి జివ్వుమనే. ఇది రాతిరి జేసుకునే పండగాబట్టి ఆయమ్మి దొరికినా దొరుకుతుంది' అనిపిస్తాంది. రొంత సీకటిపడినాక బయలుదేరితి.

చిన్నగా అడుగులు ఏస్తాండ గుడిసెలదారి దిక్కుకు. శ్యామల అందం గుర్తొచ్చినప్పుడల్లా అడుగులు మరింత వేగంగా పడతాండయి.

ఎన్నల మల్లెపూల తిన్నా కురుస్తోంది.

గంగమ్మ గుడికాడ జోరుగా పలకలు మోగుతాండయి.

చెక్కభజనలో గురువులయ్య గొంతు వినపడతాంది.

కాలిదావగుండా అడుగులు సాగుతాండయి.

ఎట్టియినా గానీ ఈ యాల ఆయమ్మిని అనుభవించాలనేదే కోరిక. నడక వేగం పెరిగింది.

గురువులయ్య గొంతు బిగ్గరగా వినిపిస్తాంది...

'వయసులో వుండే కన్నెపిల్లలంతా బహు చక్కగా ఈ మొలకల పున్నమినాడు నవధాన్యాలను మొలకలు తెప్పించడంలో పోటీ పడినారు.

**ఆయమ్మిని అందుకొని అనుభవించాలనే ఉబలాటం ఉప్పెనై పొంగుతాంది.**

**గుండె తనకలాడతాంది.**

**అంత ఈదురుగాలిలోనూ సేతల్లోని దీపం ఆరిపోకుండా ఎక్కతానే వుంది ఆయమ్మి. నాకైతే యాడలేని భయం పట్టుకుంది.**

**అట్నే ఎక్కుతాండ.**

చాలా బాగుంది. మీరు పడిన శ్రమంతా తెలుసు. మొన్నెప్పుడో పుట్టమన్ను తెచ్చి దాంట్లో అన్నిరకాల ధాన్యాలను పోసి ఈ పున్నమినాడు గుడిలోకి తెచ్చారు. మీకు మంచి మొగుళ్ళు రావాలని ఆ గంగమ్మ తల్లి సాక్షిగా కోరుకుంటాండను. నానబెట్టిన బియ్యంలో నల్లనూగులు, బెల్లం కలిపిన ప్రసాదం తీసుకోండి. మీకిష్టమైన వాళ్ళకివ్వండి. ఇక్కడ మట్టి ప్రమిదల్లో వెలిగే దీపాలను మీకిష్టమైన వారిని మదిలో తల్సుకొని ఆ ఏటిగట్టునున్న కోనేరులో వదలండి. మీ కోరిక ఫలిస్తుంది'' చెప్పడం పూర్తయినట్లుంది. చెక్క భజన మళ్ళీ మొదలైంది. గురువులయ్య పాట అందుకున్నాడు''.

''రావణా నీ ఆగడాలు చాలించుకోవయ్యా
అగ్నిలాంటి సీత మీద మనసు నీకు ఏలయ్యా...'
తద్దింకితాంతై... తద్దినక తాంతై...

ఇంగ ఇదే సరైన సమయం.

ఆయమ్మి కూడా దీపం తీసుకొని కోనేరు కాడికి ఎల్లబారి వుంటాది. ఆ దావ మధ్య కాపుగాసి సెట్లలోకి లాక్కుపోతే ఆయమ్మి యింగేం జేస్తాది.

అడ్డదారిగుండా నడక పెంచితి.

ఎన్నెల కుండపోతగ కురిసిపెడతాంది.

ఎట్లైనాగానీ ఈయాల ఆయమ్మి అందాన్ని అందుకునే తీరాల. మనసు తొందరపెడతాంది. సింతమాన్ల కాన్నుంచి అడ్డందూరి కోనేరు దిక్కు కాన్నే ముడుక్కోని కాపుకాస్తా వుంటి.

దూరంగా సేతుల్ల దీపాలు పెట్టుకొని ఆడపిల్లలు వస్తాండరు. ఆ.. ఆయమ్మి గూడా వుంది వాళ్లల్లో. దానెక్క దొరికింది ఈరోజు అనుకుంటి.

ఆయమ్మి వస్తాంది. దగ్గరగా. ఇంగా దగ్గరగా.

దీపం వెలుగులో ఆయమ్మి అందం మెరిసిపోతాంది.

దగ్గరికొస్తాంది... వస్తాంది... కోనేరు యింగ రొంత దూరంలో వుందనగానే దారి మారింది.

ఆయమ్మి వాలకం మారింది. ఆ పక్కనుండే కలింకాయల పొదలకాడ కాలిబాట వుంది. ఆ దావ పట్టింది. నడక పెంచింది. సేతుల్లోని దీపం ఆరిపోకుండా నడక ఇంగ రొంత జోరు జేసింది.

ఒంటిగా పోతాంది ఆయమ్మి.

నాకైతే ఏమీ అర్థంకాలేదు. ఆయమ్మి ఎమ్మిడితి వచ్చిన అమ్మాయిలందరూ కోనేరులో దీపాలు యిడుస్తుండరు.

నేను పొదలో నుంచి పైకి లేసి ఆయమ్మి పోతాండే దావ దిక్కు బయలుదేరితి.

ఆయమ్మి రాళ్ళూ, రప్పలూ, ముళ్ళు ఏమీ సూసుకోకుండా సాగిపోతాంది.

నేనూ ఆయమ్మి ఎనకాలే పోతాండ.

ఆయమ్మి రాళ్ళగుట్ట ఎక్కింది.

నాకేం దిక్కు తెల్సి సావడం లేదు.

ఆయమ్మిని అందుకొని అనుభవించాలనే ఉబలాటం ఉప్పెనై పొంగుతాంది.

గుండె తనకలాడతాంది.

అంత ఈదురుగాలిలోనూ సేతల్లోని దీపం ఆరిపోకుండా ఎక్కతానే వుంది ఆయమ్మి. నాకైతే యాడలేని భయం పట్టుకుంది.

అట్నే ఎక్కుతాండ.

కాళ్ళో తుమ్మ కంపముల్లు దిగింది. ఆ పక్కనుండే బండరాతీమీద కూకొని పెరికితి. ముల్లుతో పాటి నెత్తురు బయటికొచ్చింది.

అప్పటికే ఆయమ్మి రాళ్ళగుట్ట దిగింది.

ఆ పక్కనే వుండే దావెంబడి పోతానే వుంది.

నేనూ కుంటుకుంటా దిగడం మొదలుపెడితి.

సెండుమల్లెపూల వాసన నన్ను అల్లుకుంది.

ఆయమ్మి పోతా.. పోతా... నిలబడింది.

ఆడికి రాగానే గుండె పగిలేలా ఏడుస్తాంది...

సేతిలోని దీపం కిందపెట్టింది.

సమాధి...

ఆ... అది మా సాంబుడి సమాధి.

నాకైతే కాళ్ళూ, సేతులూ ఆడలేదు.

శిలతిన్నా ఆడ్నే నిలబడిపోతి. ఆయమ్మి ఏడుస్తానే వుంది. సేతికేసుకుండే గాజులు పగలగొట్టుకొంది. నుదుటి బొట్టు చెరిపేసుకుంది.

పడిపడి ఏడుస్తాంది. పైట కొంగులోంచి నూగుల బెల్లం వుంట తీసి సమాధికి తినిపిస్తాంది.

నేను నిల్చున్న చోటే కుప్పకూలిపోయాను.

సినుకులు కురసడం మొదలైంది.

★